సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం | 15 | అక్టోబర్ | 2023



పెద్దలకు బియ్యం ఇచ్చేందుకు..

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్:పితృ అమావాస్యను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో జనం తమ పూర్వీకులకు బియ్యం ఇచ్చుకున్నారు. శనివారం ఉదయం నుంచే పెద్ద బజార్‌లోని వేదపండితులు, పూజారులకు పెద్దల పేరున బియ్యం, కూరగాయలు ఇచ్చుకుని ఆశీర్వాదాలు పొందారు. స్థానిక పెద్దబజారు హనుమాన్ ఆలయం, గీతానగర్ సమీపంలోని అయ్యవార్లు, బ్రాహ్మణులు, జంగమయ్యలకు పితృదేవతల పేరిట సంతర్పణలు చేశారు.



జయహో భారత్

క్రికెట్ ప్రపంచకప్‌లో భాగంగా శనివారం ఇండియా, పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌ను క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకించారు. పాకిస్తాన్ జట్టు తక్కువ స్కోర్‌కే ఆలౌట్ కావడంతో భారత్ సునాయాసంగా భారీ విజయం సాధించింది. సిరిసిల్లలో క్రికెట్ అభిమానులు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. – సిరిసిల్లటౌన్

న్యూస్‌రీల్

బాలసాహిత్య పురస్కారం అందుకున్న అశోక్



బాలసాహిత్య పురస్కారం అందుకుంటున్న గరిపెల్లి అశోక్

ముస్తాబాద్(సిరిసిల్ల): భాష సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వ సౌజన్యంతో నిర్వహిస్తున్న డాక్టర్ వేదగిరి రాంబాబు పురస్కారాల ప్రదానోత్సవం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ముస్తాబాద్‌కు చెందిన బాలసాహితీవేత్త, కవి, విమర్శకులు గరిపెల్లి అశోక్ బాల సాహిత్య పురస్కారం అందుకున్నారు. ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, కవులు విహారి, సుధామ, వెంకటరమణ చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. అశోక్‌ను కవులు, రచయితలు జూకంటి జగన్నాథం, పత్తిపాక మోహన్, మద్దికుంట లక్ష్మణ్ అభినందించారు.

బోయినపల్లిలో బతుకమ్మ బావి



బోయినపల్లిలో బతుకమ్మ బావి

బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రంలోని చెన్నాడి కొండాల్‌రావు ఇంటి ముందు ఖాళీ స్థలంలో గ్రామస్తులు ఏళ్లుగా బతుకమ్మ ఆడుతుంటారు. ఇక్కడ ఏటా బతుకమ్మ వేడుకలకు చిన్న గుంత తవ్వి అలుకుపూత చేసి ముగ్గులతో అలంకరిస్తారు. దీన్ని బతుకమ్మ బావి అంటారు. సాయంత్రం ఈ బావి చుట్టూ మహిళలు తెచ్చిన బతుకమ్మలు పెట్టి ఆడుకొని.. అందులోనే బతుకమ్మలు వేస్తారు. ఇది అనాదిగా బోయినపల్లిలో వస్తున్న సంప్రదాయం. కొండాల్‌రావు సతీమణి చెన్నాడి సరోజనమ్మ ఈసారి సైతం బతుకమ్మ బావి తవ్వించి ఆచారాన్ని కొనసాగిస్తున్నారు.

డిగ్రీ కాలేజీలో మేరా దేశ్.. మేరా మిట్టి



మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న విద్యార్థినులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మేరా దేశ్ మేరా మిట్టి నిర్వహించారు. సీసీఎంబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ తిలకించారు. అనంతరం బతుకమ్మ పేర్చి ఆడిపాడారు. ప్రిన్సిపాల్ రజనీ, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కర్రోళ్ల నర్సయ్య పేరు పెట్టాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్షం నేతలు

సిరిసిల్లటౌన్: మల్కపేట రిజర్వాయర్‌కు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కర్రోళ్ల నర్సయ్య పేరు పెట్టాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సిరిసిల్లలోని కార్మికభవనంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఈవిషయమై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఈనెల 17న సిరిసిల్లకు వస్తున్న సీఎం కేసీఆర్ ఈమేరకు ప్రకటన చేయాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు రాగుల రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సురేశ్‌నాయక్, నాలుక సత్యం, పంతం రవి, మల్లేశ్, బాలయ్య, రవి పాల్గొన్నారు.





సిరిసిల్లలో బతుకమ్మ వేడుకలు



వేములవాడ రాజన్న ఆలయ ధర్మగుండంలో బతుకమ్మల నిమజ్జనం



వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



వేములవాడ గుడి ఆవరణలో..



సిరిసిల్ల బతుకమ్మ ఘాట్ వద్ద..



ఒక్కేసి పువ్వేసి చందమామ

సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్/వేములవాడ: 'ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ..' జిల్లాలోని వనితలు శనివారం ఎంగిలి పూల సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. తొమ్మిది రోజులపాటు సాగే బతుకమ్మ వేడుకలు తొలిరోజు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతీ వీధి.. బతుకమ్మ వేడుకలతో సందడిగా మారింది. జిల్లా కేంద్రంలోని మానేరుతీరంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ తొట్టిలో నిమజ్జనం చేశారు. ముత్తయిదువలు పసుపు, కుంకుమలు, వాయినాలు ఇచ్చుపుచ్చుకున్నారు. ఫలహారాలతో గౌరమ్మకు నైవేద్యం సమర్పించారు. వేములవాడ: రాజన్న ఆలయం వద్ద స్థానిక మహిళలు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటేలా నిర్వహించుకున్నారు. అనంతరం మూలవాగులోని బతుకమ్మ తెప్ప వద్ద నిమజ్జనం చేశారు. రాజన్న ఆలయం వద్ద బతుకమ్మలు ఆడుకున్న మహిళలు ధర్మగుండంలో నిమజ్జనం చేశారు.



ముస్తాబాద్ శ్రీశివకేశవుల ఆలయం వద్ద..

దారులన్నీ తెలంగాణ భవన్‌కే..

- నేడు బీ ఫారాలు అందుకోనున్న 'కారు' పార్టీ అభ్యర్థులు
- విజయంపై ధీమాతో రాజధానికి ప్రయాణం
- మూడోసారి అందుకునే వారే అధికం..





సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికల పరుగుపందెంలో ముందంజలో ఉన్న అధికార బీఆర్ఎస్ పార్టీ.. బరిలో నిలిచే అభ్యర్థులకు ఆదివారం బీ ఫారాలు అందించనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి అసెంబ్లీ బరిలోకి దిగనున్న అభ్యర్థులంతా ఉదయం 9గంటల వరకు తెలంగాణ భవన్‌కు చేరుకోనున్నారు. అక్కడ 11 గంటలకు సీఎం చేతుల మీదుగా బీ ఫారాలు అందుకోనున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కొత్త అభ్యర్థులతో పార్టీ అధ్యక్షులు కేసీఆర్ కాసేపు మాట్లాడుతారు. భోజనం అనంతరం వారంతా తిరుగుముఖం పడతారు. హుస్నాబాద్‌లో సభా ఏర్పాట్ల నేపథ్యంలో కరీంనగర్, సిద్దిపేట, హుస్నాబాద్ నేతలు కాస్త ముందుగానే బయల్దేరుతారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహులు చాలా మంది రాజధానికి చేరుకున్నారని సమాచారం. వీరిలో ముగ్గురు తొలిసారి, ఇద్దరు రెండోసారి, ఆరుగురు మూడోసారి, ఒకరు ఐదోసారి, మరొకరు ఏడోసారి బీ ఫారాలు అందుకోనుండడం గమనార్హం.

ఈ దఫాతో ఎవరెన్నిసార్లంటే..

- కొప్పుల ఈశ్వర్, ధర్మపురి: ఏడుసార్లు (2004, 2008, 2009, 2010, 2014, 2018, 2023)
- కేటీఆర్, సిరిసిల్ల: ఐదుసార్లు (2009, 2010, 2014, 2018, 2023)
- గంగుల కమలాకర్, కరీంనగర్: మూడుసార్లు (2014, 2018, 2023)
- పుట్ట మధు మంథని: మూడుసార్లు (2014, 2018, 2023)
- దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి: మూడుసార్లు (2014, 2018, 2023)
- రసమయి బాలకిషన్, మానకొండూరు: మూడుసార్లు (2014, 2018, 2023)
- వొడితెల సతీశ్‌బాబు, హుస్నాబాద్: మూడుసార్లు (2014, 2018, 2023)
- డాక్టర్ సంజయ్, జగిత్యాల: మూడుసార్లు (2014, 2018, 2023)
- సుంకె రవిశంకర్, చొప్పదండి: రెండుసార్లు (2018, 2023)
- కోరుకంటి చందర్, రామగుండం: రెండుసార్లు (2009, 2023)

తొలిసారి అందుకునేవారిలో

- డాక్టర్. కె.సంజయ్ (కోరుట్ల) : తొలిసారి
- పాడి కౌశిక్‌రెడ్డి (హుజూరాబాద్): తొలిసారి
- సీహెచ్ లక్ష్మీనరసింహారావు (వేములవాడ): తొలిసారి

విజయంపై ధీమా..

పదేళ్లుగా పార్టీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులే తమను తిరిగి గెలిపిస్తాయని గులాబీ పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుచుకున్న 88 సీట్లకు మించి ఈసారి విజయం సాధిస్తామంటున్నారు. గత రెండు ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 12 స్థానాల్లో జయకేతనం ఎగురవేస్తూ వచ్చిన తాము.. ఈసారి 13కు 13 సీట్లు గెలిచి తీరుతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శనివారంతో అమావాస్య ముగియనుంది. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ సభతో పార్టీ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి సమరశంఖం పూరించనున్నారు. ఆ వెంటనే బీ ఫారాలు అందుకున్న అభ్యర్థులంతా ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయనున్నారు. చాలామంది నాయకులు ఎన్నికల ప్రచార రథాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు.

ఆనందంగా ఉంది



నాపై విశ్వాసంతో టికెట్ కేటాయించి నేడు బీఫారం అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాను. మూడు నెలలుగా అన్నివర్గాల ప్రజలతో మమేకం అయ్యాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలే నన్ను గెలిపిస్తాయి. తప్పకుండా భారీ మెజారిటీతో గెలిచి మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు కృషి చేస్తాను.

– చల్మెడ లక్ష్మీనర్సింహారావు

విభేదాలు సృష్టించే వారిని తరిమికొట్టాలి



ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

- చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్న హిందూ, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించేందుకు వస్తున్న వారిని తరిమికొట్టాలని బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు కోరారు. పట్టణంలోని బింగి మహేశ్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన ముస్లిం కమిటీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లింల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పట్టణంలో ఇప్పటి వరకు షాదీముబారక్‌లో 350 మందికి లబ్ధి చేకూరిందని, 45 మందికి మైనార్టీబంధు రావాల్సి ఉందన్నారు. కోడ్ అమలుతో రాలేకపోయాయని అన్నారు. షాదీఖానా నిర్మాణం, గురుకుల పాఠశాల అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఓటేసి తనను గెలిపిస్తే ముస్లింల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం కమిటీ పట్టణాధ్యక్షుడు అక్రమ్ తోపాటు వంద మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాస్‌రావు, నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందర్, మారం కుమార్, ఇప్పపూల అజయ్, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, గజానందరావు, పీర్ మహమ్మద్, రామతీర్థపు రాజు, సలీం, బాబున్, కట్కూరి శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్, గూడూరి మధు, కందుల క్రాంతి, సర్వర్‌పాషా, అహ్మద్ బషీర్, అబ్దుల్ రజాక్, మహమ్మద్ కరీం, మహమ్మద్ మున్నా, అంజద్ పాషా, ఇఫ్తెఖార్ హుస్సేన్, గౌస్‌బాబా, మహమ్మద్ రఫీ, మహమ్మద్ సలీం, షేక్ అహ్మద్‌షరీఫ్, సయ్యద్ అతీక్ పాల్గొన్నారు.

అన్నివర్గాల ఆదరణతోనే గెలుపు

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



పార్టీలో చేరుతున్న లింగంపల్లి యువకులు

చందుర్తి(వేములవాడ): అన్ని వర్గాల ఆదరణతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండలం లింగంపేటలోని 80కి పైగా యువకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆది శ్రీనివాస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కుల, మత, ప్రాంత వివక్ష లేకుండా అన్ని వర్గాలను కాంగ్రెస్ ఆదరిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో ప్రజలు విసిగిపోయారని, అందరి చూపు కాంగ్రెస్ పార్టీ వైపు ఉందని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల వెంట ఉండి సేవ చేసే తనను ఈ ఎన్నికల్లో వేములవాడ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ నాగంకుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పులి సత్యం, గొట్టె ప్రభాకర్, మ్యాకల గణేశ్, వేల్పుల దేవస్వామి, బొజ్జ మల్లేశం, బంగారి శేఖర్, బండారి రాజిరెడ్డి, దారం రాంచంద్రం, అల్లూరి రవీందర్‌రావు, తర్రె గణేశ్, ముద్దాల రాము, చిర్రం నరేశ్, నరేశ్, జనార్దన్ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లక్రైం: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం పనిచేయాలన్నారు. పోలీస్ అధికారులకు, సెక్టోరల్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వొద్దన్నారు. అధికారులకు సంబంధిత ఠాణా పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై అవగాహన ఉండాలన్నారు. స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు (ఎస్ఎస్‌టీ), ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అక్రమ మద్యం, నగదును కట్టడి చేయాలన్నారు. ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరిశంకర్ అవగాహన కల్పించారు. డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవికుమార్, సీఐల తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా ముడిసరుకుల విక్రేతల బైండోవర్

- 158 మంది తహసీల్దార్ ఎదుట హాజరు



తహసీల్దార్ ముందు ముడిసరుకుల విక్రేతలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా గుడుంబా ముడి పదార్థాలు విక్రయించే వారిని ఎక్సైజ్ అధికారులు శనివారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు. ఎన్నికల నేపథ్యంలో నేరాలు జరుగకుండా నాటుసారా తయారీ, రవాణా, సేవించే ప్రాంతాలను గుర్తించి దృష్టి సారించినట్లు తెలిపారు. నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం, పటికలను విక్రయించే వారిని గుర్తించి అనుమానాస్పద వ్యక్తులను అరెస్ట్ చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించే వారిపై, అక్రమ వ్యాపారం చేసే వారిపై నిఘా పెట్టినట్లు చెప్పారు.

వారంలో పదకొండు కేసులు

ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు నాటుసారా విక్రయిస్తున్న వారిపై 11 కేసులు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. 720 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 6 లీటర్ల నాటుసారాయి, 9 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ 80 వేలు ఉంటుందని తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 158 మందిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు.

జనాభా ప్రకారం బీసీలకు టిక్కెట్లివ్వాలి



సిరిసిల్లటౌన్: జనాభా దామాషా ప్రకారం అన్ని పార్టీలు బీసీలకు టిక్కెట్లు ఇవ్వాల్సిందేనని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. స్థానిక బీసీ భవన్‌లో శనివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బీసీలకు ప్రాధాన్యత ఇవ్వని పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ప్రకారం 34 సీట్లు ఇవ్వాల్సిందేనన్నారు. గౌరీ రాకేశ్, లక్ష్మణ్, రమేశ్, స్వామి, నవీన్, రాము, తరుణ్, విజయ్ పాల్గొన్నారు.

బీసీ బిడ్డనే ఎమ్మెల్యేగా గెలిపించుకుందాం

వేములవాడఅర్బన్: నియోజకవర్గాన్ని ఒకే వర్గం పరిపాలించడంపై ప్రజలు ఆలోచన చేయాలని.. ఈసారి ఎమ్మెల్యేగా బీసీ బిడ్డనే గెలిపించుకుందామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని కోరారు. బత్తుల మహేందర్, పెంట అజయ్, సత్యం, కాసర్ల అరుణ్, నాంపల్లి అరవింద్, బాలయ్య, మహేశ్, బాపిరెడ్డి, బాలకృష్ణ, వినయ్, శ్రీధర్ ఉన్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు



రసమయి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో ఇల్లంతకుంట మండలం తెనుగువానిపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే రసమయి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెనుగువానిపల్లి నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కే ఉంటుందని తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: భార్య చనిపోయిందని మానసికంగా బాధపడుతూ ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన మాడపాటి శ్రీపతిరావు (57) భార్య ఏడు నెలల క్రితం గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందింది. అప్పటి నుంచి శ్రీపతిరావు మానసిక వేదనతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు సుజిత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తంగళ్లపల్లిలో చోరీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలోని భూర స్వరూప ఇంట్లో శుక్రవారం దొంగలుపడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఉదయం 11 గంటలకు విధులకు వెళ్లిన స్వరూప రాత్రి ఇంటికి తిరిగొచ్చే సరికి ఇంటి తాళాలు పగలగొట్టినట్లు గుర్తించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.20వేల నగదుతోపాటు 8 తులాల వెండి అపహరణకు గురైంది. ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, క్లూస్ టీమ్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ కనెక్షన్లు రెగ్యులరైజ్ చేయాలి

- సెస్ ఆఫీస్ ఎదుట పౌల్ట్రీ రైతుల ఆందోళన

చందుర్తి(వేములవాడ):తమ దగ్గర డబ్బులు తీసుకొని కరెంట్ కనెక్షన్లను రెగ్యులరైజ్ చేయడం లేదని, తాము ఇబ్బంది పడుతున్నామని వెంటనే కనెక్షన్లు రెగ్యులరైజ్ చేయాలని పౌల్ట్రీఫామ్ రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సెస్ ఆఫీస్ ఎదుట శనివారం రామరావుపేట, లింగంపేట, కట్టలింగంపేట, జోగాపూర్ గ్రామాలకు చెందిన 13 మంది పౌల్ట్రీఫామ్ రైతులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ పౌల్ట్రీ ఫామ్‌లకు విద్యుత్ కనెక్షన్ కోసం చెల్లించిన డబ్బులకు రశీదులు ఇవ్వకుండా కనెక్షన్లు ఇచ్చారన్నారు. నాలుగైదేళ్లుగా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని, కనెక్షన్ల కోసం తీసుకున్న డబ్బులకు రశీదులు ఇవ్వలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని పౌల్ట్రీ రైతులు కోరుతున్నారు.

జగజ్జనని.. శక్తి స్వరూపిణి

- నేటి నుంచి దేవి నవరాత్రోత్సవాలు
- వేడుకలకు సిద్ధమైన మండపాలు

కరీంనగర్‌కల్చరల్:అమ్మలగన్న అమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. త్రిశక్తి స్వరూపిణి.. సకల జగత్తుకు మూలం, త్రిమూర్తులకు శక్తి ప్రదాత, త్రిలోకేశ్వరీ సకలాభీష్ట ప్రదాయిని అయిన దేవి నవరాత్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయి. అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రుల్లో తొలిరోజు అమ్మవారిని కలశస్థాపనం చేసి ప్రతిష్ఠిస్తారు. అప్పటి నుంచి విజయదశమి వరకు దేవీనవరాత్రులు నిర్వహిస్తారు.



తొమ్మిది అవతారాలు

శక్తి స్వరూపిణి, ఆది పరాశక్తి అయిన దుర్గామాతను శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయణి, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిరాత్రి తొమ్మిది అవతారాల్లో భక్తులు కొలుస్తారు.

ప్రీతిపాత్రమైన రోజులు

రుద్ర రూపిణి భద్రకాళిగా ఎనిమిదవ రోజు జన్మించిన చాముండి తొమ్మిదవ రోజు వీరవిహారం చేసి దైత్య సంహారం చేసిందని పురాణాలు చెబుతున్నాయి. పదో రోజు విజయలక్ష్మీగా జనుల ఆనందోత్సవాలకు ప్రతీకగా పూజలందుకుంటుంది. నవరాత్రుల్లో చివరి మూడురోజులు అత్యంత ప్రీతిపాత్రమైనవి. వీటినే మనం దుర్గాష్టమి, మహార్నవమి, విజయదశమి పేరిట ఉత్సవాలు జరుపుకుంటాం. రోజుకో రూపంలో అమ్మవారు దర్శనం ఇస్తారు.

- **శైలపుత్రి**

చైతన్యశక్తి శైలపుత్రి, త్రిమూర్తి స్వరూపిణి ఆది పరాశక్తి సతీదేవిగా యోగాగ్నిలో తనువు చాలించింది. తిరిగి మీనా హిమవంతులకు శైలపుత్రీదేవిగా జన్మించింది. నందివాహనంపై త్రిశూల ధారిణిగా స్త్రీ శక్తిని లోకానికి తెలయజేసింది.

- **బ్రహ్మచారిణి**

సంకల్పబలం బ్రహ్మచారిణి. బ్రహ్మచారినిగా నియమనిష్ఠలతో తపస్సు చేసి శివుడిని వరించింది. చేతిలో కమండలంతో మాలధారిణిగా నిత్య తపో ముద్రాంకితగా దర్శనమిస్తుంది. ఈ రూపంలోని దుర్గాను ఆరాధించినవారికి ఏకాగ్రత దీక్ష అలవడుతుంది.

- **చంద్రఘంటాదేవి**

మనసుకు మార్గదర్శి చంద్రఘంటాదేవి. ఈ రూపంలో అమ్మవారిని ఆరాధించేవారికి శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని ప్రతీతి.

- **కుష్మాండ దుర్గ**

సర్వ దుఃఖహారిణి కుష్మాండదుర్గ. శారీరక, మానసిక రుగ్మతలను పారదోలే రూపం కుష్మాండదుర్గ. వర, అంకుశ, పాశ, అభయ ముద్రలతో కూడిన అష్ట భుజాలతో కోటి సూర్యప్రభలతో ప్రకాశించే జనని అభయ ప్రదాయిని.

- **స్కంధమాత**

మాతృదేవోభవ అనే సందేశాన్ని, అమృతత్వాన్ని మానవాళికి ప్రబోధంగా, మాతలకే మాతా అయి శ్వేత వర్ణశోభితగా, ఆదిమాతగా కుమారస్వామిని లాలించే అమ్మ రూపంలో వెలుగొందే దివ్య మూర్తి.

- **జ్ఞానశక్తి కాత్యాయనీదేవి**

సృష్టి, స్థితి, లయలకు హేతువైన శక్తి. సకల సంసార బంధాలకు కారుకురాలు. భవసాగరాల నుంచి మానవుల్ని ఉద్ధరించే శక్తి. సింహ వాహనం అధిరోహించి కరవాలం చేబుని రాక్షసత్వాన్ని పారదోలే జగద్రక్షిణిగా శోభిల్లుతుంది.

- **కాళరాత్రి**

ప్రాణికోటి జీవితాల్లోని గ్రహబాధలు తొలగించి మృత్యువుకే భయం కలిగిస్తూ దుర్గుణాలు, దుష్టశక్తులను పారదోలి సత్యకర్మల్ని ప్రేరేపిస్తూ మంచి బుద్ధిని పెంచుతుంది.

- **మహాగౌరీ**

మంగళ స్వరూపిణి మహాగౌరి. ఆదిపరాశక్తి భయంకర కాళ స్వరూపాన్ని విసర్జించిన అమ్మవారు ధవళకాంతితో వెలిగిపోయే మంగళ స్వరూపిణిగా మహాగౌరి అవతరించింది. తెల్లని వస్త్రాలు ధరించి, త్రిశూలం చేబూని శతకోటి దివ్య కాంతుల్ని భక్తజనకోటికి అభయ ప్రదానం చేస్తూ శోభిల్లుతుంది.

- **సిద్ధిధాత్రీ**

మోక్షప్రదాత్రి సిద్ధిధాత్రీ. భౌతిక జీవనంలో సర్వ సిద్ధులూ అనుగ్రహించే సిద్ధిధాత్రి అద్వైత సిద్ధికి ప్రేరణనిస్తుంది. అష్ట సిద్ధులను మోక్షమును ప్రసాదిస్తుంది.

- **అపరాజిత**

అపరాజిత శ్రీరాజేశ్వరీదేవి. సర్వమానవ జీవితాల్లో సర్వశక్తికి కేంద్రస్థానం జగజ్జననే. శరన్నవ రాత్రుల్లో అమ్మవారికి విశేష అలంకారాలు ముగిశాక విజయదశమి రోజు శ్రీరాజరాజేశ్వరిగా దర్శనమిస్తుంది.

జిల్లా సరిహద్దుల్లో పటిష్ఠ నిఘా

- ఎస్పీ అఖిల్ మహాజన్
- నర్సింగాపూర్‌లో పోలీస్ చెక్‌పోస్టు తనిఖీ

బోయినపల్లి(చొప్పదండి): జిల్లా సరిహద్దు గ్రామాల్లో పోలీస్ చెక్‌పోస్టులతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. కరీంనగర్–రాజన్నసిరిసిల్ల జిల్లాల సరిహద్దు గ్రామం నర్సింగాపూర్ చెక్‌పోస్టును శనివారం రాత్రి ఎస్పీ పరిశీలించారు. నగదు అక్రమ తరలింపు, మద్యం, మాదకద్రవ్యాలు. ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు తరలి వెళ్లకుండా తనిఖీలు తీవ్రం చేసినట్లు పేర్కొన్నారు. చెక్‌పోస్టులో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్సై మామిడి మహేందర్ తదితరులు ఉన్నారు.



వినోద్‌కుమార్ కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వినోద్‌కుమార్ వాహనం తనిఖీ

కరీంగనగర్ నుంచి వేములవాడ వెళ్తున్న ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ వాహనాన్ని నర్సింగాపూర్ చెక్‌పోస్టు వద్ద ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. కారు లోపల సోదాలు చేసిన తర్వాతనే పంపించారు.

చెక్‌పోస్టు కొదురుపాకకు మార్పు ?

నర్సింగాపూర్ వద్ద నిర్వహిస్తున్న పోలీస్ చెక్‌పోస్టును ఆదివారం కొదురుపాక చౌరస్తాకు మారుస్తారని సమాచారం. కొదురుపాకకు మారిస్తే గంగాధర వైపు వెళ్లే వాహనాలు సైతం తనిఖీ చేయొచ్చని భావిస్తున్నట్లు తెలిసింది.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు
- ఎల్లారెడ్డిపేటలో దిష్టిబొమ్మ దహనం

వేములవాడ: టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉంటూ రేవంత్‌రెడ్డి పొన్నాల లక్ష్మయ్యపై చేసిన వ్యాఖ్యలు దారుణమని, వెంటనే క్షమాపణ చెప్పాలని వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు కోరారు. తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. డబ్బు సంపాదనే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన రేవంత్, బలహీన వర్గానికి చెందిన సీనియర్ నాయకుడిపై చేసిన వ్యాఖ్యలు అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, ఇప్పపూల అజయ్, సిరిగిరి చందు, నాయకులు రాఘవరెడ్డి, ఆనందం, వెంకటేశ్వర్‌రావు, కట్కూరి శ్రీనివాస్, సలీమ్, రాజేశం, మైలారం రాము పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్యపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్లారెడ్డిపేట మండలం మున్నూరుకాపు సంఘం నాయకులు శనివారం స్థానికంగా నిరసన తెలిపారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు నంది కిషన్ రేవంత్‌రెడ్డి భేషరతుగా పొన్నాల లక్ష్మయ్యకు క్షమాపణలు చెప్పాలని కోరారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మున్నూరుకాపు సంఘం నాయకులు వరస కృష్ణహరి, బాద రమేశ్, ఉప్పుల మల్లేశం, జంగిడి సత్తయ్య, మేడిశెట్టి శ్రీనివాస్, సిరిపురం రాజిరెడ్డి, తడకల దేవరాజు, ఉప్పుల రాజిరెడ్డి, బండారి బాల్‌రెడ్డి, మీసం రాజం, తడకల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

‘అల్ఫోర్స్’లో అంబరాన్నంటిన సంబరాలు



సంబరాల్లో నరేందర్‌రెడ్డి, మంత్రి, కలెక్టర్ సతీమణులు రజిత, పుష్పకుమారి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లో అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ‘అల్ఫోర్స్ డిలైట్ –2023’ పేరిట జెన్‌నెక్స్ట్ మైదానంలో శనివారం రాత్రి నిర్వహించిన వేడుకలను మంత్రి సతీమణి గంగుల రజిత, కలెక్టర్ సతీమణి పుష్పకుమారి, డాక్టర్ వి.వనజారెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి గౌరమ్మపూజలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యా సంస్థల ఉపాధ్యాయినులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ పాటలకు ఆటలాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ప్రచారం

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ హోరాహోరీ ప్రచారం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు బలనిరూపణకు శనివారం కృషి చేశాయి. ఈనెల 17న సిరిసిల్లలో జరిగే బహిరంగ సభకు సీఎం కేసీఆర్ రానుండడంతో ఆపార్టీ పట్టణ శ్రేణులు జనసమీకరణకు జోరుగా ప్రచారం చేశాయి. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో అన్ని వార్డుల అధ్యక్షులు, కౌన్సిలర్లు ఇంటింటా తిరుగుతూ సభకు ఆహ్వానించారు. మహిళ కౌన్సిలర్లు బొట్టు పెడుతూ సభకు రావాలని కోరారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, ఎండీ సత్తార్, మ్యాన రవి ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమపాలన

రాష్ట్రంలో సుస్థిర సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణ చేనేత సెల్ అధ్యక్షుడు గుడిశెట్టి బాలరాజు నేతృత్వంలో వందమంది కార్యకర్తలు పార్టీలో చేరారు. కాంగ్రెస్ హయాంలో పద్మశాలీలు, నేతన్నలకు 35 కిలోల రేషన్ బియ్యం ఇవ్వగా.. బీఆర్‌ఎస్ పాలనలోకి రాగానే 5వేలకు పైగా కార్డులు తొలగించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని విమర్శించారు. సోనియా ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చుతాయన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, గోనె ఎల్లప్ప, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ తదితరులున్నారు.

నేడు మూడు మండలాల కాంగ్రెస్ నాయకుల సమావేశం

వేములవాడరూరల్: డీసీసీ అధ్యక్షుడు, వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించనున్నారు. వేములవాడ, వేములవాడ అర్బన్, వేములవాడరూరల్ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు హాజరుకానున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఏఐసీసీ సెక్రెటరీ క్రిస్టోఫర్ తిలక్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కోనాయపల్లి రోడ్డులోని హరిమల ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశం నిర్వహించనున్నారు.

గ్యారంటీ పథకాలకు ప్రజాదరణ

- సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు విశ్వాసం కలిగిందని, గ్రామాల్లో ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముచ్చర్లలో శనివారం పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి మహేందర్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకాని హామీలిచ్చి తొమ్మిదేళ్ల ప్రజలను మోసం చేసిన సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధిస్తే నియామకాలు వస్తాయని భావించిన యువతను కేసీఆర్ మోసం చేశారన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, మండలాధ్యక్షుడు హమీద్, నాయకులు మేడ భాస్కర్, గుర్రం రాజుగౌడ్, దేవరాజు, వెంకటేశం, అరుణ్‌రెడ్డి, ఎలుక రాజు, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ



మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

చొప్పదండిలో బీజేపీ జెండా ఎగరేస్తాం

- మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ

బోయినపల్లి(చొప్పదండి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు బొడిగె శోభ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని స్తంభంపల్లి, రత్నంపేటల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. బొడిగె శోభ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు, విలాసాగర్ మాజీ సర్పంచ్ జోగు రవీందర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు కొనుకటి హరీశ్, బొంగోని అశోక్ తదితరులు ఉన్నారు.



స్తంభంపల్లిలో బీడీ కార్మికులతో ముచ్చటిస్తున్న బొడిగె శోభ

ప్రవళికది ప్రభుత్వ హత్యే

- ఏఐఎఫ్‌బీ, ఎస్‌ఎఫ్‌ఐ, భీమ్ ఆర్మీ ఆగ్రహం

సిరిసిల్లటౌన్: ప్రవళికది ఆత్మహత్య కాదని రాష్ట్ర సర్కారు హత్యగా ఏఐఎఫ్‌బీ జిల్లా అధ్యక్షుడు మేకల కమలాకర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, భీమ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. సిరిసిల్ల, వేములవాడల్లో శనివారం వేర్వేరుగా నిర్వహించిన ప్రెస్‌మీట్లలో మాట్లాడారు. నిరుద్యోగులపై లాఠీచార్జి అత్యంత హేయనీయమైందన్నారు. గ్రూప్ 2 వాయిదా పడిందన్న మనస్థాపానికి గురైనట్లు సూసైడ్‌నోట్‌లో పేర్కొందన్నారు. రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆడుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థికసాయంతోపాటు నిరుద్యోగులపై పెట్టిన కేసులు భేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నరేశ్, బాబు, అరుణ్, తేజ, విష్ణు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న దొబ్బల ప్రవీణ్

పండుగపూట విషాదం

- బైక్ అదుపుతప్పి ఆశవర్కర్ మృతి
- పరామర్శకు వచ్చి ప్రాణాలు కోల్పోయిన సులోచన

ముస్తాబాద్(సిరిసిల్ల): అనారోగ్యంతో ఉన్న అల్లుడిని పరామర్శించేందుకు వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో అసువులు బాసింది. బైక్ అదుపుతప్పి కింద పడిపోగా.. తీవ్ర గాయాలతో దుర్మరణం చెందింది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. సిద్దిపేట జిల్లా జక్కాపూర్‌కు చెందిన ఆశవర్కర్ కోల సులోచన(49)–రాజారాం దంపతుల కూతురు రేఖను మండలంలోని గూడెంకు చెందిన యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. ఇటీవల అల్లుడికి ఆపరేషన్ కావడంతో పరామర్శించేందుకు శుక్రవారం వచ్చి, రాత్రి అక్కడే ఉన్నారు. శనివారం ఉదయమే జక్కాపూర్‌కు బైక్‌పై బయలుదేరారు. ముస్తాబాద్ నుంచి తెర్లుమద్ది వరకు ఉన్న బీటీ రహదారి పలుచోట్ల పనులు పూర్తికాక కంకర తేలింది. కంకర తేలిన రోడ్డుపై వెళ్తుండగా తెర్లుమద్ది శివారులో బైక్ అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ సంఘటనలో సులోచన తలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావం అధికమవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. జక్కాపూర్‌లో ఆశవర్కర్‌గా పనిచేస్తున్న సులోచన మృతితో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. పండుగపూట జక్కాపూర్‌లో విషాదం అలుముకుంది. మృతురాలి కూతురు రేఖ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సులోచన(ఫైల్)

చేపలవేటకు వెళ్లి యువకుడి మృతి

- గిద్దె చెరువులో రాజశేఖర్ గల్లంతు
- ఎల్లారెడ్డిపేటలో విషాదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చేపలవేటకు వెళ్లిన ఓ యువకుడు చెరువులో చిక్కుకుని ఊపిరా డక మృతిచెందిన సంఘటన మండలంలోని బండలింగంపల్లిలో పండుగపూట విషా దం నింపింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని బండలింగంపల్లికి చెందిన అనరాశి రాజశేఖర్(30) కొంతకాలంగా ఎల్లారెడ్డిపేటలో నివసిస్తున్నాడు. మండలకేంద్రం శివారులోని గిద్దెచెరువులో శనివారం ఉదయం చేపలు పట్టేందుకు మరో ఇద్దరితో కలిసి వెళ్లాడు. చేపలు పడుతూ లోతులోకి వెళ్లి చెరువులో గల్లంతయ్యాడు. ఎంతసేపటికి రాజశేఖర్ బయటకు రాకపోవడంతో చెరువు గట్టుపై ఉన్న వారికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని వెంటనే గజ ఈతగాళ్లను రంగంలోకి దింపి గాలింపు చర్యలు తీసుకున్నారు. రెస్క్యూ టీం, గత ఈతగాళ్లు దాదాపు 6 గంటలపాటు గాలించి మృతదేహాన్ని గుర్తించారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఏర్పాటుచేసిన ప్రత్యేక అంబులెన్స్‌లో సిరిసిల్లలో పోస్టుమార్టంకు తరలించారు. మృతునికి భార్య రేణుక, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రాజశేఖర్(ఫైల్)



రాజశేఖర్ మృతదేహం వద్ద రోదిస్తున్న సోదరుడు